క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

నేరేడుచర్ల : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు (శనివారం) ఎంపీపీ లకుమళ్ల జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన



ఆయిల్‌పామ్ సాగును సందర్శిస్తున్న అధికారులు, రైతులు

కోదాడరూరల్ : రైతులు ఇతర పంటలతో పాటు ఆయిల్‌పామ్ సాగు చేపడితే అధిక లాభాలు పొందవచ్చని ఏఓ పాలెం రజినీ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గుడిబండ రైతువేదికలో పామాయిల్ సాగుపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. పామాయిల్ సాగు దిగుబడి వచ్చేంత వరకు ఇతర పంటలు కూడా సాగు చేసుకోవచ్చన్నారు. పంట సాగుతో వచ్చే సబ్సిడీలు వంటి విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓలు సల్మా, మహేష్, రైతులు ఉన్నారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మండల కేంద్రంలో నిరుపేదలకు మండల వైస్ ఎంపీపీ తాళ్లూరి లక్ష్మీనారాయణ జన్మదినం సందర్భంగా శుక్రవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాత వాసవీక్లబ్ ఉపాధ్యక్షుడు పాల్వాయి గోపాలకృష్ణ వితరణ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్, జోన్ చైర్మన్ కందిబండ శ్రీనివాస్‌రావు, సభ్యులు నటరాజ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర కుంకుమార్చన



సహస్ర కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో సహస్ర కుంకుమార్చనలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర కుంకుమార్చనలు, సేవాకాలం, అలంకరణ, మంగళశాసనం కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్ చార్యులు, భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గెలుపుపై బీజేపీ నాయకుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

హుజూర్‌నగర్ : హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి ఘన విజయం సాధించడం పట్ల పట్టణంలో స్థానిక బీజేపీ నాయకులు శుక్రవారం సంబరాల జరుపుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని కార్యాలయం వద్ద మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వేముల శేఖర్‌రెడ్డి, నాయకులు ఎం.చంద్రారెడ్డి, డి.యల్లయ్య, జి.సతీష్, డి.రామరాజు, సోమయ్య, వెంకటేశ్వర్లు, శంభిరెడ్డి, శ్రీనాథ్, వీరబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్పృహతప్పి పడిపోయిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించి..

గరిడేపల్లి : ప్రమాదానికి గురై స్పృహతప్పి పడిపోయిన వ్యక్తిని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కారు దిగి వచ్చి సీపీఆర్ చేయించి ఆసుపత్రికి తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం మండలంలోని కుతుబ్షాపురంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ముగించుకొని వస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి మర్రికుంట గ్రామ సమీపంలో గ్రామానికి చెందిన జక్రునాయక్ అనే వ్యక్తి ప్రమాదానికి గురయ్యాడు. దీంతో గమనించిన ఎమ్మెల్యే సైదిరెడ్డి వెంటనే కారు దిగి వచ్చి తన గన్‌మెన్ గుగులోతు శ్రీనునాయక్‌తో సీపీఆర్ చేయించి వెంటనే 108వాహనంలో మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



చాకిరాల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకుండా ప్రమాదకరంగా ఉన్న కూడలి



నడిగూడెం వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

నడిగూడెం : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్ల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మలుపుల వద్ద పలువురు మృత్యువాత పడుతున్నారు. అలాగే అనేక మంది గాయాలపాలవుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రంలోని మసీద్ సెంటర్, తెల్లబెల్లి నుంచి రత్నవరం గ్రామానికి వెళ్లే రహదారి, రామాపురం నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేటకు వెళ్లే రహదారి, నడిగూడెం నుంచి చాకిరాల గ్రామాల మధ్య నాలుగు చోట్ల సాగర్‌ఎడమ కాల్వ వద్ద ప్రధాన రహదారి, సిరిపురం నుంచి నారాయణపురం గ్రామానికి వెళ్లే రహదారి, వేణుగోపాలపురం నుంచి బృందావనపురం వెళ్లే రహదారి, కరివిరాల నుంచి చెన్నకేశ్వాపురం వెళ్లే రహదారిపై మూడు చోట్ల, తెల్లబెల్లి నుంచి ఎక్లాస్‌ఖాన్‌పేటకు వెళ్లే రహదారిపై, వల్లాపురం నుంచి చనుపల్లికి వెళ్లే రహదారిపై రెండు చోట్లలో మూల మలుపులు మరీ ప్రమాదకరంగా మారాయి. ఈ మూలమలుపుల వద్ద కంపచెట్లు ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. నడిగూడెం, చాకిరాల రహదారిపై సాగర్‌కాల్వ వద్ద రెండేళ్ల కిందట జరిగిన రెండు ప్రమాదాల్లో ఆటోలు బోల్తాపడి చాకిరాలకు చెందిన ఓ యువకుడు, మునగాల మండలం కలకోవకు చెందిన ఓ వృద్ధురాలు మృత్యువాతపడ్డారు. పలువురు క్షతగాత్రులయ్యారు. రత్నవరం, తెల్లబెల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారిపై ఏడాది కిందట ఎదురెదురుగా ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. నారాయణపురం, సిరిపురం గ్రామాల మధ్య ఉన్న సాగర్ ఎడమ కాల్వ వద్ద మూలమలుపు వద్ద ఏడాది కిందట జరిగిన ప్రమాదంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఓవ్యక్తి మృతిచెందాడు. అలాగే ఈ రహదారులపై అనేకసార్లు ద్విచక్రవాహనాలు, ఆటోలు కూడా ప్రమాదాలకు గురయ్యాయి.

కానరాని హెచ్చరిక బోర్డులు..

మండల వ్యాప్తంగా ఉన్న ఈ రహదారులపై ఏ ఒక్క చోట కూడా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. దీంతో వేగంగా వస్తున్న వాహనదారులు రాత్రి సమయంలో మూలమలుపులు గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి



చాకిరాల నుంచి నడిగూడెం గ్రామానికి వెళ్లే రహదారిపై సాగర్‌కాల్వ వద్ద నాలుగు మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక్కడ దగ్గరకు వచ్చేంతవరకు ఎదురుగా వస్తున్న వాహనం కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల రెండు ఆటోలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు.

– వి.లక్ష్మీనారాయణగౌడ్, రత్నవరం

అధికారులు స్పందించాలి



నిత్యం ప్రమాదాలు జరుగుతున్న రహదారులపై సంబంధిత అధికారులు స్పందించాలి. మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. అడ్డుగా ఉన్న కంపచెట్లను తొలగించాలి. రహదారులను వెడల్పు చేసి సమస్యను పరిష్కరించాలి.

– ఇమ్మడి వెంకన్న, ఎక్లాస్‌ఖాన్‌పేట

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



కోదాడరూరల్ : పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్

మునగాల : దేవాలయాల అభివృద్ధికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల స్వయంభు శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయలో దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సర్వశ్రేయోనిధి(సీజీఎఫ్) కింద రూ.50లక్షలతో నిర్మించే మూడంతస్తుల రాజగోపురం, కాలక్షేమ మండపం నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గతంలో ప్రభుత్వాలు దేవాలయాలను పట్టించుకోకపోవడంతో అభివృద్ధి కరువై శిథిలావస్థకు చేరుకున్నాయని సీఎం కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి పలు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నాడని అన్నారు. రాష్ట్రంలోని 4,805 ఆలయాల దూప, దీప, నైవేద్యాల కోసం ప్రతి దేవాలయానికి రూ.6వేల చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తుందన్నారు. దీంలో నిత్యపూజల కోసం రూ.2వేలు, అర్చకుల కోసం రూ.4వేలు కేటాయిస్తుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత దేవాలయాలకు పూర్వవైభవం వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎలక బిందు, దేవాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి వెంకటచలపతి, ఆలయ ప్రధాన అర్చకుడు కందాళ శ్రీనివాసాచార్యులు, గ్రామసర్పంచ్ కొప్పుల వీరమ్మ, ఉపసర్పంచ్ ఎనుగుల నాగేశ్వరరావు, దేవాలయ కమిటీ చైర్మన్ బొంతు పుష్పావతి, దేవాలయ ధర్మకర్తలు ప్రతాపనేని లావణ్య, నారగాని సైదులు, ఎల్.గోపయ్య, గంధం రాంబాబు, గ్రామపెద్దలు ఉప్పుల ఇంద్రారెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూతన గ్రామపంచాయతీల ఏర్పాటు కేసీఆర్ ఘనతే

కోదాడరూరల్ : రాష్ట్రంలో 500జనాభా కలిగిన గ్రామాలను నూతన గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అల్వాలపురం నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల అభివృద్ధికి ఎన్నడు లేని విధంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను మంజూరు చేస్తుందని అన్నారు. 500జనాభా దాటిన ఆవాస గ్రామాలను, తండాలను పంచాయతీగా మార్చి ఇచ్చిన మాటాను సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, సర్పంచ్ మీసాల శోభరాణి, వైస్ఎంపీపీ మల్లెల రాణి తదితరులు ఉన్నారు.

పవన్ కుటుంబాన్ని ఆదుకుంటాం

మోతె : ప్రమాదవశాత్తు గోడకూలి మృతి చెందిన రావుట్ల పవన్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పన్నగూడెంలో రావుట్ల పవన్ కుటుంబాన్ని పరామర్శించి పవన్ తల్లి ఉమకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాఠశాలలో ప్రమాదవశాత్తు గోడకూలి పవన్ మృతి చెందడం బాధాకరమన్నారు. పవన్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకొనే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం జెడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీ కుట్రను బహిర్గతం చేయాలి



హుజూర్‌నగర్ : నిరసన తెలుపుతున్న బీఎస్పీ నాయకులు

హుజూర్‌నగర్ : టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ దారుల వెనుక ఉన్న కుట్రను బహిర్గతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మంద రవి డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ చేపట్టిన అమరణ నిరాహార దీక్ష మద్దతుగా హౌజ్ అరెస్టును ఖండిస్తూ ఆపార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఇందిరా చౌరస్తాలో మానవహారం, నిరసన తెలిపారు. గ్రూప్ వన్ పరీక్షను వెంటనే రద్దుచేయాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బి.సుబ్బుగౌడ్, నియోజకవర్గ మహిళా కన్వీనర్ ఎం.రమణ, మండల కన్వీనర్ ఎం.మట్టపల్లి, నాయకులు వీరాంజనేయులు, అభిలాష్, సందీప్, రఘు పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయలేరు

నేరేడుచర్ల : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ రాపోలు నవీన్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కోదాడ– జడ్చర్ల రహదారిపై పార్టీ అధినేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టును నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగుల పక్షాన దీక్ష చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు జిలకర రామస్వామి, కర్రి సతీష్‌రెడ్డి, సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు, ప్రేమ్‌కుమార్, శ్రీను, బాబు తదితరులున్నారు.

పేపర్ లీకేజీపై సీబీఐతో విచారణ జరిపించాలి

గరిడేపల్లి : పేపర్ లీకేజీపై సీబీసీతో విచారణ జరిపించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు రాంబాబుగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్పీఎస్సీని వెంటనే రద్దు చేయాలని, అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ పేపర్ లీకేజీలో ఎంతటి వారైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు మచ్చ కృష్ణ, అజయ్, బండి వెంకన్న, భరత్, వెంకన్న, రామారావు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

పాలకవీడు : టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీకేజీ ఘటనపై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీక్ ఘటనపై ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలన్నారు. ఆయన వెంట నాయకులు జానయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి



గరిడేపల్లి : కంటి పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



మఠంపల్లి : కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ జానీబీ తదితరులు

గరిడేపల్లి : సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కుతుబ్షాపురం(అగ్రారం) గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రతిఒక్కరికి కంటి పరీక్షలు జరిగేలా అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. కేసీఆర్ ముందు చూపుతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మొదటి విడతలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమానికి మంచి స్పందన రావడంతో రెండో విడత చేపట్టినట్లు పేర్కొన్నారు. కంటి పరీక్షలు చేయించుకుంటే అవసరం ఉన్నవారికి కళ్లద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాత శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజరవీందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్, సర్పంచ్ వీరమ్మ భాస్కర్‌గౌడ్, ఎంపీడీఓ వనజ, పార్థసారథి, సుధీర్, సతీష్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

చిలుకూరు : కంటి వెలుగు పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మామిడి నాగమణి చినరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్లెగూడెంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో అందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీటీసీ జయమ్మ నాగేశ్వరరావు, కార్యదర్శి సౌమ్య, మాజీ సర్పంచ్‌లు, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

మఠంపల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకంతో ప్రజల కంటి సమస్యలు పరిష్కారం అవుతాయని సర్పంచ్ పఠాన్‌జానీబీ అన్నారు. శుక్రవారం మండలంలోని రఘునాథపాలెంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అదే విధంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి వెంటన్ ఆమె కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజీదు కమిటీ అధ్యక్షుడు హఫీజ్‌ఖాన్, వైద్యాధికారి నాగేందర్, బెల్లంకొండ శ్రీనివాసరావు, పందిరి ప్రతాపరెడ్డి, సుధాకర్‌రెడ్డి, చింతచెట్టు అబ్దుల్‌రహీమ్, సయ్యద్‌రస్‌మియా, వైద్యసిబ్బంది, ఆశలు, వార్డుసభ్యులు, తదితరులున్నారు.

వైఎస్సార్ తెలంగాణ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి



పార్టీలో చేరిన వారితో మర్రి యశోదారెడ్డి

గరిడేపల్లి : వైఎస్సార్ తెలంగాణ పార్టీతోనే రాష్ట్రం అన్నీ విధాలుగా అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు మర్రి యశోదారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరడంతో వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ జిల్లెపల్లి వెంకటేశ్వర్లు నాయకత్వంలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయం వైఎస్సార్ తెలంగాణ పార్టీ అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీలో చేరిన వారిలో కుసుమ శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కమలమ్మ, సాయికిరణ్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షులు మర్రి రవీందర్‌రెడ్డి, ఉపేందర్‌గౌడ్, లక్ష్మీపురం గ్రామ అధ్యక్షుడు కుసుమ శ్రీనివాసరెడ్డి తదితరులున్నారు.

ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



పాఠశాలలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీఓ వెంకారెడ్డి

గరిడేపల్లి : ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ వెంకారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని గడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రాన్ని, గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులు, జెడ్పీ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ రికార్డులు, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల రికార్డులను పరిశీలించడంతో పాటు పాఠశాలలో విద్యార్థులను వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లలో కొంత మంది ఉపాధ్యాయులు సంతకాలను చేయకపోవడంతో వివరాలు అడుగగా బయోమెట్రిక్‌లో హాజర్ వేసి ప్రార్థనలకు వెళ్లినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. తరగతి గదుల్లోకి వెళ్లి కొంత సేపు విద్యార్థులతో ఆయన ముచ్చటించారు.

బండి సంజయ్ అక్రమ అరెస్ట్‌పై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ కార్యకర్తలు

నేరేడుచర్ల : టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ గన్‌పార్క్ వద్ద దీక్ష చేస్తుండగా పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో కోదాడ–జడ్చర్ల రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షుడు సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, పార్తనబోయిన విజయ్‌కుమార్ మాట్లాడారు. లీకేజీకి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంమ్మూర్తి, లెనిన్, నాగిరెడ్డి, విజయ్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, పవన్, సతీష్, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్, బాలునాయక్, ఉపేందర్‌రెడ్డి, సైదులు, ప్రభురాజ్, నారాయణరెడ్డి, సతీష్ తదితరులున్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి చక్రస్నానం



చక్రస్నానంలో పాల్గొన్న అర్చకులు



పూజల్లో పాల్గొన్న జూపల్లి రామేశ్వరరావు, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో గల శ్రీదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్లకు చక్రస్నానం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ఉదయం పంచామృతాలతో అర్చకులు అభిషేకం చేశారు. స్వామి అమ్మవార్లను పట్టు పీతాంబరాలు ధరింపజేసి, వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై అధిష్టింపజేసి మహా పూర్ణాహుతిని నిర్వహించారు. అలాగే పూర్ణాహుతి సామగ్రికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణాహుతి చేశారు. అనంతరం స్వామి అమ్మవార్ల సేవను బాజా భజంత్రీలు, మంగళవాయిద్యాలతో, యువకులు చేసే నృత్యాలు, చిన్నపిల్లల కేరింతలతో రంగులు చల్లుకుంటూ పుష్కరిణి వద్దకు గంధం, అత్తర్ పన్నీరు కలిపిన నీటిని చల్లుకుంటూ ఆనందోత్సవాల మధ్య చక్రస్నానం నిర్వహించారు. అనంతరం పుష్కరిణి వద్ద స్వామి అమ్మవార్లకు విశ్వక్సేన ఆరాధన చేసి గంగ పూజ చేసి స్వామివార్లకు స్నానమాచరించారు. కార్యక్రమంలో మైహోం సిమెంట్ పరిశ్రమ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు కుమారి దంపతులు, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఏపీలోని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మునగాల రాంమ్మోహనరావు అరుణ దంపతులు, వినోద్‌రావు, భార్గవి, ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

21న ఇంటర్వ్యూలు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన 4యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపికకు ఈనెల 21న ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకర్ల సమక్షంలో నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఆధార్, పాన్, రేషన్‌కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాడ్జీనంబర్, కుల, ఆదాయ ధ్రువపత్రాలతో మున్సిపల్ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నర్సింహులగూడెంలో క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

మునగాల : వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్యశిబిరాలను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీశైలం అన్నారు. శుక్రవారం మండలంలోని నర్సింహులగూడెంలో రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సిబ్బంది వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీశైలం మాట్లాడారు. క్షయవ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తి దగ్గినప్పుడు తుంపర్ల ద్వారా వచ్చే బ్యాక్టీరియా ఒకరి నుంచి ఒకరికి వ్యాపించి టీబీ జబ్బుగా మారే ప్రమాదముందన్నారు. వారానికి మించి దగ్గు, ఆయాసం, దగ్గుతో కూడిన కళ్లె పడడం, రాత్రి పూట జ్వరం, బరువు తగ్గడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో క్షయ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. టీబీ నోడల్ పర్సనల్ అధికారి లింగం రామకృష్ణ మాట్లాడుతూ.. పౌష్టికాహార లోపంతో వ్యాధి నిరోధక శక్తి తగ్గి క్షయవ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. 2025 సంవత్సరం లోపు భారత దేశంలో క్షయవ్యాధిని పూర్తిగా నివారించడానికి ఆరోగ్యశాఖ కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో క్షయవ్యాధి నివారణ పర్యవేక్షకుడు నిమ్మల వెంకటేశ్వర్లు, ఏఎస్ఎం పావని, ల్యాబ్ టెక్నీషియన్ స్వాతి, ఆశవర్కర్లు సుధారాణి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామంలో ఏఐటీయూసీ అనుబంధ ట్రాక్టర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాచర్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా గుడిపల్లి వీరబాబు, కార్యదర్శిగా బెజవాడ చినవీరబాబు, సహాయ కార్యదర్శిగా కూరపాటి రాంరెడ్డి, కోశాధికారిగా అలవాల రాజేష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పొరడ్ల మట్టయ్య, రామారావు, వెంకటయ్య, ఉపేందర్, పెద్ద మల్లయ్య మహమద్, రామారావు పాల్గొన్నారు.

సమర్థంగా అమలు చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఏడీఏ సంధ్యారాణి

చిలుకూరు : గ్రామాల్లో సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని హుజూర్‌నగర్ పశువైద్యశాల ఏడీఏ, మండల ప్రత్యేక అధికారి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని రామాపురంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఈదయ్య, ఏఈ లక్ష్మారెడ్డి, ఎంఈఓ సలీమ్‌షరీఫ్, సర్పంచ్‌లు కొడారు బాబు, మీసాల గంగా లింగయ్య, గ్రామకార్యదర్శి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పవన్ మృతి బాధాకరం

మోతె : రావుట్ల పవన్ మృతి బాధాకరమని కాంగ్రెస్ నాయకుడు పందిరి నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అప్పన్నగూడెంలో రావుట్ల పవన్ కుటుంబాన్ని ఆయన పరామర్శించి మాట్లాడారు. గురుకుల హాస్టల్‌లో ప్రమాదవశాత్తు గోడకూలి పవన్ మృతి చెందడం బాధాకరంగా ఉందన్నారు. అనంతరం పవన్ కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మునగాల : మండలంలోని కలకోవలో గురువారం ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడడంతో విద్యుత్ తీగలు తెగిపడి ఓ పాడిగేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన పసన కోటేశం ఇంట్లో విద్యుత్ తీగలు తెగి పాడిగేదెపై పడడంతో విద్యుదాఘాతానికి గురై సుమారు రూ.75వేల విలువగల పాడిగేదె మృతి చెందినట్లు సర్పంచ్ కొంపెల్లి సుజాత శుక్రవారం తెలిపారు.